

# SUNDARAYYA VIGNANA KENDRAM

1-8-1/b/25/a, Bagh Lingampally
Hyderabad - 44. A.P., India.
Telefax : 91-40-27667543

Managing Trustee : KORATALA SATYANARAYANA
Secretary : C. SAMBI REDDY
Treasurer : ALLURU SATYANARAYANA

## <u>సుందరయ్య 21వ వర్ధంతి సందర్భంగా</u>

## <u>కార్యదర్శి నివేదిక 19-05-2006</u>

సుందరయ్య గారిని గురించి తెలియని వారుండరు. ఆయన నిరాడంబరత, త్యాగనిరతి, పట్టుదల, కష్టజీవుల రాజ్యం కొరకు ఆయన సాగించిన అవిశ్రాంత పోరాటం - అన్నీ అందరూ యెరిగినవే. ఆయన స్మృతి చిహ్నంగా యేర్పడిందే సుందరయ్య విజ్ఞాన కేంద్రం.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రధాన వుద్దేశ్యం మన సాంస్కృతిక వారసత్వాన్ని సమీకరించి, భద్రపరిచి, ప్రపందానికి అందుబాటులోకి తేవడంతో పాటు భవిష్యత్తరాలకు అందించడం కూడా. దానికితోడు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలు, సోషలిస్టు సిద్ధాంతం, ఆచరణల పై పరిశోధనను ప్రోత్సహించడం మరియు ప్రజాస్వామ్య, లౌకిక బృందాలతో కలసి లేదా స్వతంత్రంగా పరిశోధనను చేపట్టడం.

### <u>సుందరయ్య పరిశోధనా గ్రంధాలయం</u>

విజ్ఞాన కేంద్రం ఆశయాలకు అనుగుణంగానే ముందు ఒక పరిశోధనా గ్రంధాలయాన్ని యేర్పాటుచేయడం జరిగింది. తెలుగు, వుర్దూ, యింగ్లీషు భాషలలో యెంతో అరుదయిన, చారిత్రకంగా విలువయిన లక్షానలభైవేల పుస్తకాలు, జర్నల్స్, రిపోర్టులు అందులో వున్నాయి. వాటితో పాటు అనేక వ్రాత ప్రతులు కూడా వున్నాయి. ముఖ్యంగా వుర్దూ, తెలుగు భాషల్లో మరుగునపడ్డ తరతరాల మన చరిత్రకు సంబంధించిన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలపై కొత్త వెలుగులు నింపే అరుదయిన సాహిత్యం యిక్కడ వుంది.

### <u>రాష్ట్రమంతా చెల్లాచెదురుగాపడివున్న మన సాంస్కృతిక సంపద</u>

లిఖితరూపంలో వున్న మన సాంస్కృతిక సంపద రాష్ట్రమంతటా, ముఖ్యంగా గ్రామాలు, చిన్న చిన్న పట్టణాలలో ఆలనాపాలనా కరువై శిధిలావస్థకు చేరువవుతూవుంది. ఆస్థితిలో వున్న, అందునా మారుమూలప్రాంతాల్లో పడివున్న సమాచారం పరిశోధకులకు అందడం అసంభవం. అంతేకాదు, వలస పాలన, దాని దోపిడీకి వ్యతిరేకంగా సాగిన జాతీయ విముక్తి పోరాటంలో కార్మిక, కర్షక వర్గాలు, స్త్రీలు, హరిజనులు, గిరిజనులు, వివిధ సామాజిక తరగతుల పాత్ర, కళా సాహిత్య రంగాల్లో అవి ప్రతిఫలించిన తీరు - వీటికి సంబంధిచిన ప్రాధమిక సమాచారాన్ని సేకరించకుండా మన సాంస్కృతిక వారసత్వం పరిపూర్ణంకాదు. యిది గ్రంథాలయాలతోపాటు వ్యక్తుల దగ్గర, గ్రామాలలోనూ, ప్రజాసంఘాలు, సంస్థలవద్ద కూడా వుండవచ్చు. యీప్రాథమిక సమాచారాన్నంతా సేకరిందాలి, భద్రపరచాలి, విజ్ఞానకేంద్రం వెబ్ సైట్ www.sundarayya.org ద్వారా దాన్ని పాఠకలోకానికి, పరిశోధకులకు అందుబాటులోకి తేవాలి.

### <u>యూనియన్ కాటలాగ్ ప్రాజక్టు</u>

చెల్లాచెదరుగా పడివున్న సమాచారాన్ని పాఠకలోకానికి అందుబాటులోకి తెచ్చేప్రయత్నంలో భాగంగానే యూనియన్ కాటలాగ్ ప్రాజక్టును ప్రారంభిందాము. దక్షిణ భారతదేశంలో వివిధ భాషల్లో ప్రచురించబడ్డ పుస్తకాలు, జర్నల్స్, వ్రాతపతులకు ఎలక్ట్రానిక్ డేటాబేస్ ను తయారుచేయడం, అందులో

E-mail : svk.secretary@gmail.com
Website : www.sundarayya.org
Reg. Office : Akulavari Street, Vijayawada - 02, A.P., India.

అరుదయిన వాటిని మైక్రోఫిల్మ్ చేసి డిజిటైజ్ చేయడానికి చికాగో యూనివర్సిటీ తోడ్పాటు అందింది. తెలుగు, వుర్దూ భాషలలో యిప్పటికే 40వేల పుస్తకాలకు ఎలక్ట్రానిక్ డేటాబేస్ తయారయింది. యింత వరకు తెలుగులో ప్రచురించబడ్డ పుస్తకాలన్నిటికీ అవి యే గ్రంధాలయంలో వున్నా వాటికి ఎలక్ట్రానిక్ డేటాబేస్ తయారుచేసి ఆ డేటాను సుందరయ్య విజ్ఞాన కేంద్రం వెబ్ సైట్ లో పెట్టాలనేదే మా ప్రగాఢ వాంఛ. ఆవిధంగా యేపుస్తకం యే గ్రంధాలయంలో వున్నా విజ్ఞాన కేంద్రం వెబ్ సైట్ ద్వారా పాఠకప్రపంచానికి అందుబాటులోకి వస్తుంది.

## ఆదరణ కొరవడ్డ గ్రామీణ గ్రంధాలయాలు

యీ ప్రాజెక్టుల్లో భాగంగానే విజ్ఞాన కేంద్రం చేపట్టిన అధ్యయనంలో అనేక గ్రామాలు, చిన్న పట్టణాల్లో వెలుగులోనికిరాని అమ్మూల్యమైన మన లిఖిత సాంస్కృతిక సంపద, ప్రభుత్వ ఆదరణ కరువై జీర్ణావస్థకు చేరుతున్న వైనం బయటపడింది. వుదాహరణకు వేటపాలెం, కుముదవల్లి, వోడూరు, అమృతలూరు, పిఠాపురం గ్రంధాలయాలు, సంజీవ్ దేవ్ గారి మూడువేల పెయింటింగులు, పై ప్రాజక్టుల సహకారంతో యీ అమూల్యమయిన సాహిత్య సంపదను కాపాడే బాధ్యతను చేపట్టాము.

కేటలాగింగ్ మరియు అరుదయిన పుస్తకాల మైక్రో ఫిల్మింగ్ పని ప్రారంభమయింది. స్టేట్ ఆర్కైవ్స్ లోని 20వేలకు పైగా పుస్తకాలకు ఎలక్ట్రానిక్ రికార్డ్స్ తయారయ్యాయి. బ్రిటీష్ లైబ్రరీ గ్రాంటుతో వేటపాలెం; సి.పి. బ్రౌన్ గ్రంధాలయం, కడప; శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయం, హైదరాబాద్ లోని వేలాది అరుదయిన గ్రంధాలను మైక్రోఫిల్మ్ చేయడం జరిగింది. యీపని మరికొన్ని సంవత్సరాలు కొనసాగుతుంది. లక్షలాది పుస్తకాలకు ఎలక్ట్రానిక్ డేటాబేస్ తయారవుతుంది. వేలాది అరుదయిన గ్రంధాలు మైక్రోఫిల్మ్ మరియు డిజిటైజ్ చేయబడతాయి. యిదంతా విజ్ఞాన కేంద్రం వెబ్ సైట్ ద్వారానే ప్రపంచానికి అందుబాటులోకి వస్తుంది. అంతేకాదు, లక్షలాది పుస్తకాలు విజ్ఞాన కేంద్రం గ్రంథాలయానికి డొనేషన్ రూపంలో వచ్చి చేరతాయి. దానితో విజ్ఞాన కేంద్రంలో యేర్పడబోయే పరిశోధనా సంస్థ 'శోధన'కు యీ గ్రంథాలయం ఒక ప్రధాన వనరుగా పనిచేస్తుంది. యూనియన్ కాటాలాగ్ ప్రాజెక్టు, గ్రామీణ గ్రంధాలయాల గుర్తింపు, బ్రిటీష్ లైబ్రరీ గ్రాంటు-వీటన్నిటిలో ప్రొ. అట్లూరి మురళిగారు చూపిన చొరవ మరియు చేసిన కృషికి ప్రత్యేక అభినందనలు.

## శోధన

గత సంవత్సరం శోధన పేరుతో కొన్ని సదస్సులు మాత్రమే నిర్వహించగలిగాము. కాని యీ సంవత్సరం ఒక ముఖ్య పరిశోధనా కార్యక్రమాన్ని చేపట్ట బోతున్నాము.

మన దేశంలో ఓట్ల కొరకు పాపులిస్టు నినాదాలతో ప్రణాళికలు ప్రజల ముందుకు వస్తున్నాయి. అవేవీ వాస్తవంలో అణగారిన ప్రజల ఆర్ధిక, సామాజిక ప్రగతికి తోడ్పడేవికావు.

కాబట్టి శోధన జనవిజ్ఞాన వేదికతో కలిసి జిల్లాలకు వేర్వేరుగాను, మొత్తం రాష్ట్రానికి సమగ్ర ప్రణాళికలు తయారు చేయాలని నిర్ణయించింది. ప్రజల మధ్య, ప్రాంతాలమధ్య, గ్రామాలకూ పట్టణాలకూ మధ్య పెరుగుతున్న అంతరాల్ని తగిస్తూ ఆంధ్రప్రదేశ్ సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడే సమగ్ర ప్రణాళికలను

తయారుచేసే యీ కార్యక్రమంలో శోధన, జనవిజ్ఞాన వేదికలు అడుగుడుగునా ఆయారంగాల్లోని నిష్ణాతులయిన మేధావుల సహకారాన్ని సమీకరించ వలసి వుంటుంది. సమాచార సేకరణ, Random శాంపిల్ సర్వే, డ్రాఫ్టులు తయారు చేసి చర్చకు పెట్టడం, వాటిని finalise చేసి ప్రణాళికలు రూపొందించడం-మొత్తం ఒక సంవత్సరకాలం పట్టవచ్చు.

## ఈసంవత్సరం విరాళంగా అందిన పుస్తకాలు

ప్రముఖ మహిళా వుద్యమనాయకురాలు శ్రీమతి మల్లాది సుబ్బమ్మ, ప్రముఖ రచయిత కీ.శే. రాంభట్ల క్రిష్ణమూర్తి , ప్రొ. చేకూరిరామారావు, ప్రొ.శపీజ్ హెగ్డే, ప్రొ. జావీద్ ఆలాం, లాంటి ప్రముఖులు మరియు ప్రముఖ తెలుగు దిన పత్రిక ఆంధ్రజ్యోతి యాజమాన్యం, తాము అమూల్యంగా భద్రపరచుకున్న వుత్త మోత్తమ గ్రంధాలను మన గ్రంధాలయానికి బహూకరించారు. ఆవిధాంగా యీ సంవత్సరం మొత్తం 8 వేల పుస్తకాలు మన గ్రంధాలయానికి చేరాయి.

## సదస్సులు

సదస్సులు నిర్వహించడంలో యీ సంవత్సరం వెనక పడ్డాము. 5 సదస్సులు, లైబ్రరీ కాటలాగింగ్ మరియు ప్రిసర్వేషన్లమీద రెండు వర్కుషాపులు జరిపాము. యిందులో సాహితీ స్రవంతి తో కలసి సాహితీ సమాలోచన అనే పూర్తిరోజు సదస్సును జరిపాము.

## ప్రచురణలు

"వ్యవసాయ సంక్షోభం" పై జరిగిన సెమినార్ పత్రాలతో పుస్తకం వెలువడింది. " వీరతెలంగాణా విప్లవ పోరాటం – గుణపాఠాలు" యింగ్లీషు రెండవ ముద్రణ వెలువడింది. "ఫౌండేషన్ బుక్స్" వారుదాన్ని ముద్రించి మార్కెట్ చేస్తున్నారు. సుందరయ్య గారి ఆటోబయాగ్రఫీ కూడా నేషనల్ బుక్ ట్రస్టువారు యింగ్లీషులో ప్రచురిస్తున్నారు. తరువాత యితర భారతీయ భాషలలో కూడా అది వస్తుంది.

## యితరకార్యక్రమాలు

వివిధ రకాల ప్రతికలు వందకుపైగా రీడింగుహాలుకు వస్తున్నాయి. రోజు మూడు వందలకుపైగా పాఠకులు దానిని వుపయోగించుకొంటున్నారు. సభలు సమావేశాలు సాంస్కృతిక కార్యక్రమాలతో సుందరయ్య కళానిలయం, మినీహాలు; ప్రదర్శనలు, బహిరంగ సభలతో సుందరయ్యపార్కు నిత్యం కళకళాలాడుతుంటాయి. కూచిపూడినృత్యంలో బాలికలకు శిక్షణ కొనసాగుతుంది. నాట్యశాల వార్షికోత్సవంలో పిల్లలతోపాటు వాళ్లతల్లిదండ్రులు, బంధుమిత్రులు వుత్సాహంగా పాల్గొన్నారు. బాలికల నృత్యప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.

యీ సందర్భంగా నూతన భవన సముదాయానికి కోరిన చోట నాలుగు యకరాల విలువయిన స్థలాన్ని యిచ్చి, భవన నిర్మాణానికి చెల్లించవలసిన 42 లక్షల రూపాయల డెవెలప్ మెంటు చార్జీల చెల్లింపు నుండి మనకు మినహాయింపు యిచ్చిన రాష్ట్రప్రభుత్వం, ముఖ్యమంత్రి డా. వై. యస్. రాజశేఖర రెడ్డి గారికి విజ్ఞాన కేంద్రం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అలాగే యింత కాలం విజ్ఞాన

కేంద్రానికి వుదారంగా తోడ్పాటునందించిన దాతలందరికి యీసందర్భంగా కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నాను.

<u>నూతన భవన నిర్మాణం</u>

నూతనభవన నిర్మాణం అనుకున్నట్టుగా ప్రారంభించ లేక పోయాము. సరయిన ప్లానుకొరకు వెతుకులాటలోనే యీసంవత్సరం గడిచిపోయింది. యిప్పుడు అంతా సిద్ధమయింది. పని ప్రారంభమయింది. పరిశోధనా గ్రంధాలయం, పరిశోధన మరియు సాంస్కృతిక కేంద్రాల యేర్పాటుకు అవసరమయిన మొదటిదశ నిర్మాణం పూర్తిచేయడానికి 4 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. యింతకాలం దాతలు అనేక విధాలుగా తోడ్పాటునందించారు. వారి అండదండలు, ట్రస్టు సభ్యుల దీక్ష, సిబ్బందితోడ్పాటు తోనే విజ్ఞాన కేంద్రం యింతగా రాణింపుకు వచ్చింది. యిక్కడే కాదు అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు గడించిన విదేశీ విశ్వ విద్యాలయాలు, విద్యారంగ సంస్థల నుండి కూడా అండ దండలు సంపాదించగలిగే స్థాయికి అది చేరింది. యిదంతా మన సాంస్కృతిక సంపదను కాపాడి, ప్రపంచానికి అందుబాటులోకి తెచ్చి, మన గతాన్ని మరింత సమగ్రంగా అర్థం చేసుకోడానికి తోడ్పడేదిశలో పరిశోధనను ప్రోత్సహించడానికే. మా యీ ప్రయత్నానికి యింతకు ముందు మాదిరిగానే యిప్పుడు కూడా పుష్కలంగా మీ తోడ్పాటు అందగలదని ఆశిస్తున్నాను. . అందించాలని కోరుతున్నాను.

విజ్ఞాన కేంద్రం పురోభివృద్ధికి తోడ్పడిన దాతలందరికి మరొక్కమారు ధన్యవాదాలు తెలియజేస్తూ, సభకు విచ్చేసిన పెద్దలు, సోదర,సోదరీమణులందరకూ విజ్ఞాన కేంద్రం తరపున స్వాగతంచెబుతూ శెలవుతీసుకొంటున్నాను.

సి. సాంబిరెడ్డి
సి. సాంబిరెడ్డి
కార్యదర్శి.

హైదరాబాద్
19.05.2006